క్లుప్తంగా

మట్టి నమూనాల సేకరణ



పెసరవాయిలో మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏఓ, వ్యవసాయ సిబ్బంది

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాలల్లోని ఆర్బీకేల ఆధ్వర్యంలో పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు ఏఓ హేమసుందర్రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో మట్టినమూనాల సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఆర్బీకేలో 25 మట్టి నమూనాలను సేకరించాలన్నారు. వీటిని ఈ నెల 25వ తేదీ లోపు నంద్యాలలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాలని ఆదేశించారు. భూసార పరీక్షల ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఒలంపిక్ డే సందర్భంగా కల్లూరు అర్బన్ చెన్నమ్మ సర్కిల్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంఈఓ శ్రీనివాసులు, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి ఒలంపిక్ జ్యోతిని వెలిగించి, జెండా ఊపి ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ క్రీడలతో ఇతరులతో స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. ఒలింపిక్ క్రీడలతో పొరుగు దేశాలతో స్నేహసంబంధాలు బలపడతాయన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ అబ్రహం, వాసుదేవయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

పాణ్యం: స్థానిక చెంచు కాలనీలో వానలకు తడిసి గురువారం రాత్రి మిద్దె కూలిపోయినట్లు బాధితుడు తోట నాగేంద్ర తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దె బాగా తడిసిందన్నారు. రాత్రి పడుకునే ముందు మట్టి రాలుతుండడంతో అప్రమత్తమై కుటుంబ సభ్యులతో బయటకు రావడంతో ప్రమాదం తప్పిందన్నారు.

పోలీసుల పల్లెనిద్ర



మాట్లాడుతున్న ఎస్ఐ పవన్కుమార్

గూడూరు : పట్టణంలోని పడమర బీసీ కాలనీలో గురువారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ పవన్కుమార్ కాలనీ వాసులతో మాట్లాడుతూ కాలనీలో కొత్త వారు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీలో అవాంఛనీయ ఘటనలు జరిగినా, ఘర్షణలు జరిగినా పోలీసుల సాయం తీసుకోవాలని సూచించారు. గ్రామస్తులు సామరస్యంగా, అన్నదమ్ముల వలే జీవించాలని కోరారు.

మెరుగైన సేవలందించాలి

గూడూరు రూరల్ : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని ఎంపీడీఓ మాధవీలత అన్నారు. పెంచికలపాడులో గురువారం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు సచివాలయాల్లో స్పందనను నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు.

రహదారి ఏర్పాటు చేయండి



కలెక్టర్కు పోస్టుకార్డు పంపుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఏపీ మోడల్స్కూల్కు రహదారిని ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. కొన్నేళ్ల నుంచి పాఠశాలకు సరైన రహదారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఈ విషయమై విద్యార్థు లు పోస్టు కార్డు రాసి నంద్యాల జిల్లా కలెక్టర్కు పోస్టు చేశారు. విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బత్తిని ప్రతాప్, సిద్ధార్థ డిమాండు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల జాతర

- చిన్నారులను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు
- నాడు–నేడు ద్వారా విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం
- మెరుగైన విద్యతతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం
- వారం రోజుల్లో కొత్తగా 410 మంది విద్యార్థుల చేరిక



బూజునూరు పాఠశాలలో గోడపై బొమ్మను ఆసకిగ్తా చూస్తున్న తల్లి, కుమారుడు



బిలకలగూడూరు ఎంపీపీఎస్లో విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న హెచ్ఎం మహాలక్ష్మి



గడివేముల ఎస్టీ కాలనీలో.. ప్రభుత్వ పాఠశాలల వసతులను వివరిస్తున్న హెచ్ఎం చంద్రశేఖర ఆచారి

గడివేముల: విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో కూర్చోవడానికి బండల్లేని బడులకు మా పిల్లలను పంపేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్న తల్లిదండ్రులు ప్రస్తుతం వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు క్యూ కడుతున్నారు. కేవలం పదిరోజుల్లోనే 410 మంది విద్యార్థినీ, విద్యార్థులు అడ్మిషన్లు పొందడమే ప్రభుత్వ పాఠశాలకు పెరుగుతున్న డిమాండ్కు ఉదాహరణ. వివరాల్లోకి వెళితే.. గడివేముల మండలంలో మొత్తం 38 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 13 పాఠశాలల్లో రూ. 2.91 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. 26 పాఠశాలల్లో రెండో దశ నాడు–నేడు పనులకు రూ.7.90 కోట్లు మంజూరు చేశారు. మొన్నటివరకు ఈ పాఠశాలల్లోనేనా మా పిల్లలు ఉన్నది అన్నంతగా రూపురేఖలు మారిపోవడంతో ఆదరణ పెరుగుతుంది. గతంలో కంటే ఈ విద్యా సంవత్సరంలో మండలంలో కొత్తగా 410 మందికిపైగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని విద్యాధికారులు తెలిపారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు గతంలో పట్టణాల్లో తమ పిల్లలను చదివించేందుకు ఉత్సాహం చూపిన తల్లిదండ్రులు నేడు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను చూస్తూ మురిసిపోతున్నారు. దీంతో పాఠశాలల్లో సీట్లకు డిమాండ్ పెరిగింది.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బొమ్మలు

నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా తరగతి గదుల్లో రంగురంగుల బొమ్మలు వేయించారు. చిన్నారులకు అర్థమయ్యేలా వాటి పేర్లను రాశారు. ప్రతి గదిలో నాలుగేసి ట్యూబ్లైట్లు, ఫ్యాన్లు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ప్రాథమిక విద్యలోనే ఇంగ్లిష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించేలా తగిన బోధనోపకరణ సామగ్రి సిద్ధం చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో ఇంగ్లిష్ ల్యాబ్ను ఏర్పాటు చేసి గది, ఆ గదిలో 4కే ఆండ్రాయిడ్ స్మార్ట్ టీవీలు కూడా ఏర్పాటు చేశారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా అడ్మిషన్లు



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. మండలంలోని 38 పాఠశాలల్లో 175 మంది దాకా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఇప్పటికే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశాం. ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి ఉచితంగా ట్యాబ్లు అందజేయడం జరిగింది. అలాగే పాఠశాలలో జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు నాణ్యమైన అహారాన్ని అందిస్తున్నాం. విద్యార్థుల ఇంటి వద్దకే వెళ్లి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను వివరిస్తున్నారు. తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూసి తమ విద్యార్థులను చేర్పిస్తున్నారు.

– రామకృష్ణుడు, ఎంఈఓ, గడివేముల

దరఖాస్తు చేసుకోండి

గూడూరు రూరల్ : జూలకల్ ఆదర్శ పాఠశాలలో 7 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు గురువారం ప్రిన్సిపల్ దిల్షాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 7, 8, 9వ తరగతులలో ఖాళీగా సీట్లను రాత పరీక్ష ద్వారా భర్తీ చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. అసక్తి కలిగిన విద్యార్థులు ఆయా తరగతులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గ్రామైక్య సంఘాల అభివృద్ధికి కృషి చేయండి

పాణ్యం: మండలంలోని అన్ని గ్రామైక్య సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని ఏపీఎం ప్రసాద్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పొదుపు కార్యాలయంలో పొదుపు మహిళలు, సీసీలు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం పొదుపు మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. జగనన్న తోడు పథకం కింద మంజూరైన లబ్ధిదారులను గుర్తించి వారి ఆర్థికాభివృద్ధికి రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. మహిళలు తీసుకున్న అప్పులను సక్రమంగా చెల్లించే విధంగా చూడాలన్నారు.

'సుంకేసుల'లో 1.152 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు గురువారం డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు నగర వాసుల నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డీఎల్డీఓ బాలకృష్ణారెడ్డి

కోడుమూరు రూరల్ : గ్రామ సచివాలయ సిబ్బంది పనివేళల్లో తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ బాలకృష్ణారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ప్యాలకుర్తి, కోడుమూరులలోని గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈనెల 24నుంచి వలంటీరీలు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏయే సేవలు, ఏయే సర్వీసులు అవసరమవుతున్నాయో తెలుసుకుని నోట్ చేసుకుని జూలై 1నుంచి అమలు చేసే జగనన్న సురక్ష కింద వాటిని మంజూరు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కోడుమూరు పంచాయతీ ఈఓ అజయ్భాస్కర్ ఉన్నారు.

బయట విక్రయించే ఆహార పదార్థాలు తినరాదు



ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: బయట విక్రయించే ఆహారపదార్థాలు తినకూడదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. గురువారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయం–1లో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఒకరోజు ముందుగానే ఆరోగ్య సేవలు అవసరమైన వారికి సమాచారమందించి ఫ్యామిలీ ఫిజిషియన్ హెల్త్ క్యాంపులో పాల్గొనేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఓపీకి వచ్చిన వారందరికి రక్త పరీక్షలు చేసి మందులు అందించాలన్నారు. గర్భిణులు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్ నందు అప్లోడ్ చేయలని సూచించారు. కార్యక్రమంలో ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి భాస్కర్రెడ్డి, సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారుడికి టార్పాలిన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ అనూష

ఓర్వకల్లు : జిల్లా సమగ్ర నీటి యాజమాన్య సంస్థ వారు పంపిణీ చేస్తున్న యంత్ర పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు తోట అనూష కోరారు. గురువారం స్థానిక సచివాలయం వద్ద లబ్ధిదారులకు మంజూరైన టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి కృషి సంచయూ యోజన (పీఎంకేఎస్వై) కింద సాగునీటి సదుపాయం కలిగిన రైతులకు వ్యవసాయ, యంత్ర పనిముట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం వాటర్ షెడ్ కింద ఎంపికైన శకునాల, తిప్పాయపల్లె, గుట్టపాడు, హుసేనాపురం, కాల్వ, ఓర్వకల్లు గ్రామాల రైతులకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. మొదటి విడత కింద ఆయా గ్రామాలలో కలిపి దాదాపు 1,200 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఓసీ, బీసీ రైతులకు 80 శాతం రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్(ఐ అండ్ సీబీ) మహ్మద్హుసేన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతిచెందిన మల్లెపోగు అనిల్

కర్నూలు: కర్నూలు–అలంపూర్ వెళ్లే రైలు మార్గంలో తుంగభద్ర బ్రిడ్జి సమీపంలో ఓ యువకుడు గురువారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. సీ బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన నాగప్ప, సునంద దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడైన మల్లెపోగు అనిల్ అలియాస్ ఆదాం (22) ఇంటర్ వరకు చదువుకున్నాడు. ఉపాధి నిమిత్తం తిరుపతిలో సమీప బంధువుల దగ్గరికి వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి బుధవారం సాయంత్రం కర్నూలు చేరుకున్నాడు. గురువారం ఉదయం రైలు పట్టాలపై శవమై కనిపించాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోదండరాముడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ప్రమాదంలో అనిల్ మృతదేహం రెండు ముక్కలుగా విడిపోయింది. మృతదేహాన్ని రైలు కొంత దూరం ఈడ్చుకుపోయింది. మృతుని లగేజీ బ్యాగు కూడా మరికొంత దూరంలో పడిపోయింది. ప్రమాదవశాత్తు రైలుపై నుంచి పడి మృతిచెందాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా, తిరుపతికి వెళ్తున్నట్లు చెప్పిన వ్యక్తి హైదరాబాద్ వైపు వెళ్లే రైలు మార్గంలో మృతిచెందడంపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు చెప్పే విషయాలు జరిగిన సంఘటనకు పొంతన కుదరకపోవడంతో పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష' పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): జూలై 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం స్టాంటన్పురంలోని వైఎస్సార్సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాలు జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఆయా మండలాల తహసీల్దార్, ఎంపీడీఓ రెండు బృందాలుగా ఏర్పడి పర్యవేక్షించాలన్నారు. తాను రోజూ ఐదు సచివాలయాల పరిధిలో కార్యక్రమంలో పాల్గొంటానని స్పష్టం చేశారు. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ, డేట్ఆఫ్ బర్త్, మరణ ధ్రువీకరణ పత్రాలు, భూ కొనుగోలు అనంతరం ఆన్లైన్లో నమోదు, ఆన్లైన్లో భూ వివరాల నమోదులో మార్పులు, చేర్పులు, వివాహ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్, ఆధార్కు మొబైల్ నంబర్ లింకింగ్, కౌలు గుర్తింపు కార్డులు, కొత్త రేషన్కార్డులు వంటి సేవలు అదించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే 1 నుంచి 28వ తేదీ వరకు కోడుమూరు, గూడూరు, సి బెళగల్, కర్నూలు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. తహసీల్దార్లు ఆర్శివరాముడు, జయన్న, శేషఫణి, ఎంపీడీఓలు ఆజాం ఖాన్, మాధవీలత, రాముడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలిసికట్టుగా పనిచేసి జగనన్న సురక్ష కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం మండలంలోని అమడగుంట్ల, వెంకటగిరి గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జయన్న సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమ విధివిధానాలపై సిబ్బందికి సూచనలిచ్చారు.

సి.బెళగల్: ఈనెల 27వ తేది నుంచి చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంగా వ్యవహరించి విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు ఆదేశించారు. గురువారం కొత్తకోట గ్రామ సచివాలయంలో సర్పంచ్ శ్రీనివాసులు అధ్యక్షతన ఉద్యోగులు, వలంటీర్లకు జగనన్న సురక్ష కార్యక్రమం అమలు, విధానాలు, నిర్వహణపై సూచనలు చేశారు.

గూడూరు: జగనన్న సురక్ష' కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాధవీలత, తహసీల్దార్ మాట్లాడారు.

కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు పెంచాలి

కోడుమూరు : కర్నూలు జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో అదనంగా సీట్లను పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రంగస్వామి కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జయన్నకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. రంగస్వామి మాట్లాడుతూ నిత్యం కరువుతో సతమతమయ్యే కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో బాలికలను చదివించుకునేందుకు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కేజీబీవీ పాఠశాలల్లో సీట్లను పెంచి వారందరికి చదువుతో పాటు, వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు వీరేష్, ఇంద్ర, సునీల్ తదితరులున్నారు.

వైఎస్సార్సీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం పంచలింగాల గ్రామం వైఎస్సార్సీపీ కార్యకర్త సత్యరాజు భార్య మరియమ్మ, దేవమడ గ్రామ వైఎస్సార్సీపీ కార్యకర్త కురువ తిరుపాల్ అనారోగ్యంతో మృతి చెందారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ గురువారం మరియమ్మ, కురువ తిరుపాల్ స్వగృహంలో వారి పార్థీవదేహాలకు పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేడు ఆర్.కొంతలపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 23, 24 తేదీల్లో కర్నూలు మండలం ఆర్ కొంతలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ కేఏ అజాం ఖాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించండి



గడివేముల జెడ్పీ హైస్కూల్లో బయోమెట్రిక్ను పరిశీలిస్తున్న డీఈఓ సుధాకర్రెడ్డి

గడివేముల: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనుల్లో నాణ్యత పాటించాలని నంద్యాల జిల్లా డీఈఓ సుధాకర్రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలతో పాటు గడిగరేవుల జెడ్పీ స్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ సుధాకర్రెడ్డి మట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఇప్పటికే జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కిట్లను అందుకున్న ప్రతి విద్యార్థితో ఆన్లైన్లో బయోమెట్రిక్ వేయించాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో అందిస్తున్న సదుపాయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. గడిగరేవుల పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకోరావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామక్రిష్ణుడు, విమాలా వసుంధరదేవి, హెచ్ఎం ఇమ్మానియల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ నీళ్ల మోటార్ల దొంగల అరెస్ట్

- 12 మోటార్లు, రెండు ఆటోలు, రూ.65 వేల నగదు సీజ్



వ్యవసాయ నీళ్ల మోటర్లను స్వాధీనం చేసుకుని దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: వ్యవసాయ నీళ్ల మోటార్లు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న దొంగల ముఠా ఆట కట్టించారు పోలీసులు. వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు చోరీకి గురయ్యాయని బాధితుల ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నాల్గవ పట్టణ పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను సంతోష్నగర్ సుంకులమ్మ ఆలయం వద్ద అరెస్టు చేసి కటకటాలకు పంపారు. కల్లూరు మండలం ముజఫర్ నగర్కు చెందిన సురేష్ గోపాల్, ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన ఎరుకలి బాలనాగన్న అలియాస్ బాలు, కర్నూలు శ్రీనివాసనగర్కు చెందిన గానిగ రామప్ప, వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన పరశురాం, శివప్ప నగర్కు చెందిన బాలుడు ముఠాగా ఏర్పడి కర్నూలు తాలూకా పీఎస్ పరిధిలో పది, నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, ఉలిందకొండ పోలీస్స్టేషన్ పరిధిలో నాలుగు, ఓర్వకల్లు పీఎస్ పరిధిలో రెండు మోటర్లను చోరీ చేశారు. అందులో ఏడు మోటార్లకు సంబంధించి రాగి వైరును బయటకు తీసి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. మరో 12 మోటార్లను సంతోష్నగర్ శివారులోని ముళ్లపొదల్లో ఆటోల్లో భద్రపరచి బయటకు తరలించడానికి సిద్ధంగా ఉంచినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 12 మోటార్లతో పాటు రెండు ఆటోలను, రూ.65 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం నిందితులను మీడియా ముందు హాజరుపరిచి సీఐ శంకరయ్య వివరాలు వెల్లడించారు. ఒక ఆటోను కడపలో చోరీ చేసినట్లు విచారణలో బయటపడిందని సీఐ తెలిపారు. ఇందుకు సంబంధించి కడప వన్టౌన్ పీఎస్లో ఆటో చోరీ కేసు నమోదైనట్లు తెలిపారు. మొత్తం ఐదుగురు ముఠా సభ్యుల్లో నలుగురిని రిమాండ్కు పంపి బాలుడిని కర్నూలు బి.క్యాంప్లోని జ్యువైనల్ హోమ్కు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



దుంగలు పడడంతో ఇరుక్కుపోయిన డ్రైవర్ సుధాకర్

గడివేముల: మండల పరిధిలోని నంద్యాల –నందికొట్కూరు ప్రధాన రహదారిలోని గడిగరేవుల మలుపు వద్ద గురువారం కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. మిడుతూరు మండలం రొళ్లపాడు గ్రామం నుంచి నంద్యాలకు కర్ర దుంగలను తీసుకెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పులిమద్ది గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సుధాకర్పై దుంగలు పడ్డాయి. గమనించిన వాహనదారులు వెంటనే డ్రైవర్ను బయటికి తీశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

మండలంలో గత రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. తొల్లకరి జల్లులు ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతన్నలు ట్రాక్టర్లు, ఎద్దులతో భూమి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ బోర్ల కింద పంటలను సాగు చేసిన రైతులు ఎరువులు, మందులు చల్లుతున్నారు. – కల్లూరు



దూపాడులో టమాట సాగుకు నేలను సిద్ధం చేస్తున్న రైతన్న, చిన్నకొట్టాలలో ఎద్దుల బండిపై ఎరువులను తీసుకెళ్తున్న రైతు →